ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023
8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

గుణదల ఫ్లైఓవర్ ఉద్యమంపై

పోలీసుల ఉక్కుపాదం

15 మంది సాధన కమిటీ, సిపిఎం నేతల అక్రమ అరెస్టు • వివిధ స్టేషన్లకు తరలింపు

ప్రజాశక్తి - విజయవాడ : ధర్నాలు, నిరసనలపై అధికార వైసిపి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఏళ్ల తరబడి మొండిగోడలకే పరిమితమైన విజయవాడ గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ సాధన కమిటీ అధ్వర్యంలో గురువారం చేపట్టిన మహాధర్నాపైనా పోలీసులు అణచివేత ధోరణి అవలంభించారు. సాధన కమిటీ నిరసనకు సంఘాభావం తెలిపేందుకు వస్తున్న సిపిఎం నేతలను ఎక్కడికక్కడ అడ్డగించి అరెస్టు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మహాధర్నా వద్దకు వస్తుండగా, వన్‌టౌన్‌కు వెళ్లే దారిలో ఎర్రకట్ట వద్ద పోలీసులు నిలిపివేశారు. సిఐలు కాశీ విశ్వనాథ్, కృష్ణమోహన్ తమ పోలీసు బలగాలతో వచ్చి నడిరోడ్డుపై అడ్డగించి ఆయనను అరెస్టు చేశారు. అనంతరం బలవంతంగా పటమట పోలీసుస్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు నిర్బంధించారు. అలాగే గుణదల మూడు వంతెనల సెంటర్‌కు చేరుకుని ట్రాఫిక్‌కు ఏవిధమైన అంతరాయం లేకుండా రోడ్డుకు ఒకవైపున ధర్నాకు ఉపక్రమించిన స్థానిక ప్రజలను, వారికి మద్దతుగా నిలిచిన సిపిఎం నేతలను కూడా అడ్డుకున్నారు. సమస్య పరిష్కారంపై దష్టి పెట్టకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్న వారిని కనీసం నిలబడేంత సమయం కూడా ఇవ్వకుండా (మిగతా 6లో)

ఎర్రకట్ట వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావును అరెస్టు చేస్తున్న సిఐలు, పోలీసు సిబ్బంది

నిర్బంధాలు గర్హనీయం

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ చేపట్టిన మహాధర్నాను అడ్డుకునేందుకు సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు, పలువురు నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజలు ఫ్లైఓవర్ సాధన కమిటీ పేరుతో రాజకీయ పార్టీలకతీతంగా చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు (మిగతా 6లో)

అరెస్టులు సిగ్గుచేటు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్

గుణదల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ నిరసన తెలిపేందుకు వెళ్లిన సిపిఎం, ఫ్లైవోవర్ సాధన కమిటీ సభ్యులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తీవ్రంగా ఖండించారు. అరెస్టయిన సిహెచ్.బాబూరావుతోపాటు మిగిలిన 14 మంది (మిగతా 6లో)

ముఖం చాటేసిన వర్షాలు

- అక్టోబర్లో 48.2 శాతం లోటు
- మొదట్లో అతివృష్టి, ఇప్పుడు అనావృష్టి
- పంటలకు సాగునీటి ఎద్దడి



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు రైతులను కష్టాలకు గురిచేస్తున్నాయి. జూలైలో కురిసిన అధిక వర్షాలకు లక్షల ఎకరాల పంట ముంపునకు గురైంది. ఈనెలలో చోటు చేసుకున్న వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో సగటున వెయ్యి మిల్లీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదవుతోంది. నైరుతీ, ఈశాన్య రుతుపవనాల కారణంగా జూన్ నుంచి నవంబర్ చివరి వారం వరకు అధికంగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు భిన్నంగా మారాయి. జిల్లాలో 3 లక్షల 68 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. జూలై చివరి వారంలో భారీ వర్షాలు కురవడంతో 1.25 లక్షల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. జూలైలో వర్షాలకు తోడు కృష్ణానదీ పరీవాహక ఎగువ ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేశారు. ఆగస్టులో సాధారణం కన్నా 44.3 శాతం తక్కువగా వర్షాలు కురిసినా పులిచింతల ప్రాజెక్టు ద్వారా నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేసి కాల్వల ద్వారా అందించారు. సెప్టెంబర్‌లోనూ సాధారణ వర్షపాతం కన్నా 26.2శాతం అధికంగా వర్షాలు కురవడంతో పంటలకు నీటి సమస్య తలెత్తలేదు. అయితే అక్టోబర్లో 48.2 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇటువంటి పరిస్థితుల్లో నదీ పరీవాహక ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాలు (మిగతా 6లో)

జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షపాతం వివరాలు

నెల	సాధారణ వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	కురిసిన వర్షం (మిల్లీ మీటర్లలో)	అధికం/లోటు - + శాతం
జూన్	91.5	93.9	+ 2.5
జూలై	196.1	360.7	+83.9
ఆగస్టు	194.4	108.4	- 44.3
సెప్టెంబర్	163.4	206.2	+26.2
అక్టోబర్	162.7	84.3	-48.2
మొత్తం	645.4	769.2	+19.2

నత్తనడక

- ముందుకు సాగని ఔషధ నియంత్రణ రాష్ట్ర ప్రయోగశాల నిర్మాణం
- 2016లో విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 80 సెంట్ల స్థలం కేటాయింపు
- 2018లో రూ.19 కోట్లు మంజూరు

విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఔషధ నియంత్రణ రాష్ట్ర ప్రయోగశాల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రం విడిపోయి సుమారు పదేళ్లవుతున్నా డ్రగ్ కంట్రోల్ ల్యాబొరేటరీ స్టేట్ హెడ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయడంలో గతంలో టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం నిర్లక్షంగానే వ్యవహరించాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఔషధ నియంత్రణ పరిపాలన విభాగానికి సంబంధించిన ల్యాబొరేటరీ ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం దీనిని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే దీనిపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం నెలకొంది. 2016లో రాష్ట్ర ప్రయోగశాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ హనుమాన్‌పేటలోని పాత ప్రభుత్వాస్పత్రిలో దీని దీని నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఇందు కోసం 0.8 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు 2016 జనవరిలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే స్థలం కేటాయింపు జరిగినా పనులు మాత్రం ప్రారంభించలేదు. సుమారు రెండున్నరేళ్ల వరకు దీనిని గాలికి వదిలేశారు. తిరిగి 2018 మే 16న ప్రయోగశాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లుగా పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణానికి రూ.19.173 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. సంవత్సరానికి 10వేల శాంపిల్స్ పరీక్షలు నిర్వహించే విధంగా నూతన ప్రయోగశాల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ పనులకు నోడల్ ఏజెన్సీగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్‌ఐడిసి) వ్యవరిస్తుందని చెప్పి ఆ బాధ్యతను దానికి అప్పగించారు. కానీ ఆరు మాసాల క్రితమే పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో రాష్ట్రస్థాయి ప్రయోగశాల ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి (మిగతా 6లో)

కౌలు రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు

ఉదారంగా రుణాలివ్వాలి

• 'దిశ' సమీక్షలో ఎంపి బాలశౌరి • ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు, రోడ్లు, వంతెనలపై చర్చ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి బ్యాంకర్లకు సూచించారు. కష్ణాజిల్లా అభివద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఎంపి బాలశౌరి అధ్యక్షతన గురువారం జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలులో జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సభ్యులుగా ఉన్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న అభివద్ధి కార్యక్రమాలు, వివిధ పథకాలు లబ్ధిదారులకు చేరేలా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా తీసుకుంటున్న చర్యలపై ఎంపీ సమగ్రంగా సమీక్షించారు. తొలుత గత సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాంశాలు, వాటి అమలుకు వివిధ శాఖలు తీసుకున్న చర్యలపై చర్యా నివేదికను జడ్‌పి సిఇఒ జ్యోతి బసు సమర్పించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రుణాల మంజూరుకు బ్యాంకర్లు చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, కౌలు రైతులకు బ్యాంకులు ఉదారంగా (మిగతా 6లో)

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి వి.బాలశౌరి

పత్తి తీతలు ప్రారంభం

గిట్టుబాటు ధర లేక రైతు దిగాలు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ప్రాంతంలో పత్తి పీతలు ప్రారంభం కావడంతో తెల్ల బంగారం గా పేరున్న పత్తికి మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడం లేక పత్తి రైతులు కుదేలవుతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలు ముందుకు రాకపోవడంతో బహిరంగ మార్కెట్లో దళారుల చేతిలో పత్తి రైతులు మోసపోతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సమయంలో క్వింటా పత్తి 10 వేలు ధర పెట్టి కొనుగోలు చేశారు. దీంతో రైతులు ధర ఎక్కువగా ఉంటుందని ఆశపడి ఖరీఫ్లో భారీగా సాగు విస్తరణ చేపట్టారు. ప్రస్తుతం పత్తికి గిట్ట రూ. 6200కు మించి ధర లేదు. ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 70 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు విస్తీర్ణం చేశారు. ఒకపక్క సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో పత్తి చేలు ఎండిపోతున్నాయి. మరోపక్క అరకొరగా పండించిన పత్తి కి గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల లాడుతున్నారు. యకరానికి 25 వేల రూపాయల నుండి 35 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తున్న తరుణంలో దళారులు సిండికేట్ గా మారి పత్తి రేటు నియంత్రించడం రైతులను తీవ్ర మానసిక శోభకు గురి చేస్తుంది. కొన్ని రోజులుగా జిల్లాలో పత్తితీతలు ప్రారంభమైనవి. రైతులు ఇళ్లల్లో పత్తిని ఆరబోసుకున్నారు. పలుచోట్ల పత్తిని మండే కట్టి ఎండబెడుతున్నారు. ప్రస్తుతం పత్తి కింటా 6,500 నుంచి కొనుగోలు చేయట్లేదు. ఈ ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి దిగుబడి ఘనంగా తగ్గుతుందని రైతులు ఆందోళన చదువుతున్నారు.

నందిగామ నియోజక వర్గంలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 18 వేల హెక్టార్లు పైగా ఉండగా ఖరీఫ్లో 13వేల ఐదువందల హెక్టార్ల పత్తి సాగు చేపట్టారు. నందిగామ మండలంలో పత్తి సాధారణ విస్తీర్ణం 2872 హెక్టార్లు కాను 1871 హెక్టార్లు సాగు అయింది. చందర్లపాడు మండలంలో 6057 హెక్టార్లు సాగు విస్తీర్ణం గాను 5512 హెక్టార్లో సాగయింది . కంచికచర్ల మండలంలో 4948 హెక్టార్లు గాను 2960 హెక్కార్లు, వీరులపాడు మండలంలో 4183 హెక్టార్లకు 3049 హెక్టార్ల సాగు విస్తీర్ణం అయింది. ప్రతి ఏటా యకరానికి 15- 20 క్వింటాళ్ల దిగబడి రావాల్సి ఉండగా, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు లేక పత్తి కాయలు పెరగడం లేదు. మొక్కలు బెట్టకు వచ్చి గిడస బారిపోయినాయి. గత ఏడాది దళారులు ఇంటి వద్దకు వచ్చి కింటాపత్తి పదివేలు కొన్నారు. ఈ ఏడాది దిగుబడి తగ్గిన ధర పెరగటం లేదు. ధర పెరుగుతుందని రైతులు ఇళ్లల్లో పత్తిని నిల్వ చేస్తున్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు పత్తి కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. ప్రస్తుతం పత్తికి ధర లేకపోవడంతో సిసిఐ కొనుగోలు కేంద్రాలు, కొనుగోలు చేయడానికి ముందుకు రావాలని రైతుల కోరుతున్నారు. సిసిఐ మద్దతు ధర ఏ గ్రేడు రూ. 7020 సాధారణ రకం రూ. 69 20 రూపాయలకు మద్దతు ధర కొనుగోలు చేస్తున్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే దళారులు పోటీపడి ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తారని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిసిఐను రంగంలో దింపి పత్తి కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ఖరీఫ్ 2023 కి సంబంధించి సామాజిక తనిఖీ నిమిత్తం ఈక్రాప్ బుకింగ్ లిస్ట్ ను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో, గ్రామ సచివాలయల్లో ప్రదర్శించడం జరిగిందని అని మండల వ్యవసాయ అధికారి, రెంటపల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రాప్‌లో నమోదు అయితేనే ధాన్యం కొనుగోలు, ప్రత్తి కొనుగోలు, కరువు పరిస్థితుల్లో భీమా, పంట నష్టం, సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాలు అందుతాయని తెలిపారు. రైతులందరూ ఈక్రాప్ లిస్ట్ పరిశీలించుకుని అభ్యంతరాలు వున్నట్లయితే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అర్జీ పెట్టుకోవాలని తెలిపారు.. అర్జీని పరిశీలించి క్రాప్ బుకింగ్ లో సవరణలు చేస్తామని తెలిపారు. ఈ అభ్యంతరాలను స్వీకరించుటకు ఈ నెల 29 ఆఖరి తేదీ అని తెలిపారు.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-మైలవరం: గత రెండు రోజులుగా మైలవరం నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మైలవరం ఎస్సీబీ సీఐ గిరిజ గురువారం తెలిపారు. మైలవరం మండలం పోరాట నగర్‌లో నిర్వహించిన దాడుల్లో భూక్య రాజగోపాల్ రావు నుండి ఐదు లీటర్లు సారాయి, 200 లీటర్లు వాష్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లికి చెందిన పద్మారావు వద్దనున్న 13 క్వాటర్లు తెలంగాణ మద్యం, మరో ఆరు ఆంధ్ర మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్ లో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్రిత సాయి కళాశాల కు చెందిన ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని పరిటాల నుండి ఇద్దరు విద్యార్థులు బైక్ పై కంచికచర్ల వస్తుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ సంఘటన లో బైక్ పై ప్రయాణిస్తున్న విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఫాస్ట్రాక్ సరికొత్త వాచీలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐకానిక్ యూత్ బ్రాండ్ ఫాస్ట్రాక్ సరికొత్తగా పార్టీవేర్ వాచ్‌లను ఆవిష్కరించినట్లు సంస్థ విజయవాడ రీజియన్ ఇన్‌ఛార్జి ఎస్.కుమారన్ ఒక ప్రకటనలో తెలిపారు. చిక్, స్టైలిష్, వినూత్నమైన వైబ్ ట్రెండ్‌లు, మార్కెట్లోకి యువతులను దృష్టిలో ఉంచుకుని తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా పార్టీల కోసం అందంగా కనిపించేందుకు తాము రూపొందించిన 71 రకాల డిజైన్‌లు యువతను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. అందరికీ అందుబాటు ధరల్లో రూ..1250 నుండి రూ.2960 మధ్య లభిస్తాయన్నారు. ఎం.జి.రోడ్డులోని ఫాస్ట్రాక్ షోరూమ్‌తో పాటు అన్ని వాచీల షోరూమ్‌లలో లభ్యమవుతాయని తెలిపారు.

వీట్ హ్యాక్స్ విడుదల

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: చర్మ సంరక్షణకు, అవాంఛిత రోమాల నిర్మూలనకు వీట్ సంస్థ సరికొత్తగా ఐకానిక్ వీట్ హ్యాక్స్‌ను రూపొందించినట్లు వీట్ కంపెనీ మార్కెటింగ్ ఇన్‌ఛార్జి రాజశేఖర్ .ఆర్. తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చర్మ సంరక్షణ గురించి ఆయన తెలియచేస్తూ కంపెనీ రూపొందించిన వీట్ హ్యాక్స్ అవాంచిత రోమాలకు చక్కగా పనిచేస్తుందని అన్నారు. అవాంచిత రోమాలతో చాలా మంది ఇబ్బందులు పడుతుంటారని వారి కోసం వీట్ నూతన ప్రొడక్ట్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. తాము రూపొందించిన ఉత్పత్తులను ప్రజలకు తెలియచేయడం కోసం వివిధ ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పరిధిలోని 11 కె.వి. హైవె ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భవానీపురం వెంకటేశ్వర ఫౌండ్రి రోడ్, హైవే రోడ్ వెంకటేశ్వర ఫౌండ్రి నుండి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి రోడ్, బాజిబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, ఔట్ ఏజెన్సీ మరియు మీరా సాహెబ్ రోడ్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎన్టిఆర్ జిల్లా పోలీస్ వారు ఆయా పోలీస్టేషన్ల పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. దేశ రక్షణ, అంతర్గత పరిరక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ శాంతి భద్రతల పరిరక్షణ కోసం అరాచక శక్తుల అణచివేసే క్రమంలో విధి నిర్వహణలో అశువులు బాసిన అమర పోలీసు వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి త్యాగనిరతికి చిహ్నంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ విధి నిర్వహణలో పోలీసు వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ సమాజ సేవలో ధైర్యసాహసాలు ప్రదర్శించి వారి ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమర వీరుల అత్యున్నత త్యాగనిరతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన "పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం" జరుపుకోవడం జరుగుతోంది. ఈ నెల 21నుండి 31 తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను వివిధ అంశాలపై రూపొందించిన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల లోని అధికారులు, సిబ్బంది , ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ స్టేషన్ విధులు, రికార్డ్స్, పోలీసులు వినియోగించే ఆయుధాలు, వైర్ లెస్ సెట్, యల్.హెచ్.ఎం.ఎస్. కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, డయల్ 112, 14400, 14500 , 1930, దిశ యాప్, పోలీస్ అమరవీరుల త్యాగాలను గురించి, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితర అంశాలపై విద్యార్థుల్లో పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. అంతేకాకుండా పలు పోలీస్ స్టేషన్లలో విద్యార్థినీ విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలను గురించి, ఫ్రెండ్లీ పోలీసింగ్, పోలీస్ స్టేషన్ విధులు, రికార్డ్స్, పోలీసులు వినియోగించే ఆయుధాలు మొదలగు అంశాలపై వ్యాసరచనా పోటీలను నిర్వహించారు.

గుణదల ఆర్ఒబిని పూర్తి చేస్తాం : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: ఒకటో డివిజన్ ఒకటో వార్డు సచివాలయం పరిధిలో స్థానిక కార్పొరేటర్ ఉద్ధంటి సునీతతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం నిర్వహించారు. ప్రశాంత్ కాలనీలో విస్తతంగా పర్యటించారు. గుణదల ఆర్వోబీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. కొందరు కోర్టులలో వేసిన కేసుల కారణంగా పనులు కొంత ఆలస్యమయ్యాయని.. త్వరలో స్టేజ్ -2 పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఇప్పటికే రూ.12.50 కోట్లతో భూమిని కూడా సేకరించినట్లు వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో మరో రెండు వంతెనలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని.. ఈలోగా ట్రాఫిక్ కు ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా ఉలవచారు కంపెనీ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు దావుబుచ్చయ్య కాలనీ వైపు రహదారులను మెరుగుపరుస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, ఉద్ధంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల కేంద్రంలో గురువారం నాడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్యంను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఐదు అంచెల్లో జరిగే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, పిల్లలు, యువత.. ఇలా ప్రతి ఒక్కరి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించి వాటిని కచ్చితంగా పరిష్కరించేలా జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో కషి చేస్తోందన్నారు. గ్రామాలలో జరిగే సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లెలు, కాలనీల్లోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలకు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి వైద్యం చేయడం రాష్ట్రంలో మునుపెన్నడూ చూడలేదన్నారు.ప్రజలకు ఇంటి వద్దే బీపీ, షుగర్, హెచ్‌బీ, డెంగీ, మలేరియా సహా ఏడు రకాల పరీక్షలు అవసరం మేరకు నిర్వహించి ఫలితాలను యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు.వైద్య ఆరోగ్య శాఖలో 50 వేల పోస్టులను నియమించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి గారికి దక్కుతుందన్నారు. ప్రతి ఆరునెలలకొకసారి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్ కుమార్ రెడ్డి , సర్పంచ్ మల్లాది రాణి ,రైతు సలహా మండలి అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర రెడ్డి (పెదబాబు),సొసైటీ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ నెంబర్ ఇమ్మానియేల్,మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు మరియు ఎంపీడీవో విష్ణు ప్రసాద్, తాసిల్దార్ పాల్ వైద్య అధికారి డాక్టర్ చెన్నకేశవనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 13వ వార్డు మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం పరిసర ప్రాంతంలో నూతనంగా నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను, చెరువు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైస్ మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర రావు, షేక్ హాఫిజున్నిసా ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, కౌన్సిలర్ శివకుమారి నరసింహరావు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్‌బాబు సమక్షంలో బిసి నాయకులు తాళ్లూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని చిల్లకల్లు, గౌరవరం గ్రామాలకు చెందిన ఎనిమిది కుటుంబాలకు చెందిన సుమారు 30 మంది టిడిపి నుండి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగాల వాసు, దొంగల జానకిరామయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపకరణాలు వితరణ

ప్రజాశక్తి-గంపలగూడెం: అనుములంక గ్రామానికి చెందిన కందికొండ అప్పిరెడ్డి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఎంపీ యూపీ పాఠశాలకు పలు ఉపకారణాలు వితరణగా అందజేశారు. గురువారం పాఠశాల సిబ్బందికి స్కానర్, ప్రింటర్, కుర్చీలు తదితరాలను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది అప్పిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయ పోలీస్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి.జాషువా హాజరయి విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి విద్యార్థితో కలిసి ఎస్పీ శాంతి కపోతాలు ఎగరవేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ శాఖ విధి నిర్వహణ, వారు విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, ఇతర పరికరాలు గుర్చి ప్రజలకు తెలుసుకోవాలని ఉత్సుకత ఉంటుందన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అన్ని రకాల ఆయుధాలు వాటి పనితీరును ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా ప్రదర్శించడం జరుగుతుందని, వీటిని విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. పోలీసులు వారి విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల వాహనాలు, అన్నింటిని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శనకు ఉంచిన ఆయుధాలను తిలకించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి జాషువా

నూతన భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

సిపిఎస్ రద్దయ్యే వరకు పోరాటం : బండి

ప్రజాశక్తి-ఉయ్యూరు : సీపీఎస్ రద్దయ్యేవరకు ఏపీఎన్జీవో సంఘం పోరాటం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. గండిగుంట గ్రామపంచాయతీ పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారి సమీపాన దాత సజ్జా వెంకటేశ్వరరావు విరాళంగా ఇచ్చిన 5 సెంట్ల స్థలంలో అసోసియేషన్ ఉయ్యూరు తాలూకా యూనిట్ భవన నిర్మాణ భవనానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉయ్యూరులో ఎన్జీవో భవనానికి అవసరమైన స్థలాన్ని సజ్జా వెంకటేశ్వరరావు తన తండ్రి సజ్జా రామారావు జ్ఞాపకార్థం విరాళంగా అదజేయడం అభినందనీ యమన్నారు. సీపీఎస్ రద్దుకోసం ఏపీఎన్జీవో సం ఘం పోరాటం చేస్తుందన్నారు. నంబర్ 2,3 తేదీల్లో ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరి గే ధర్నా కార్యక్రమానికి చలో ఢిల్లీకి రాష్ట్రం నుండి రెండువేల మందివరకు హాజరవుతు న్నామన్నారు. ఉద్యోగులకు రావలసిన అన్ని రాయితీలు, పేమెంట్లు, సరెండర్ లీవులకు సంబంధించిన డబ్బు ముఖ్యమంత్రి చొరవ తీసుకుని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీ శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, కార్యద ర్శి ఎండి ఇక్బాల్, ఉయ్యూరు యూనిట్ అధ్యక్షుడు పామర్తి నాగవెంకట సుబ్బారావు, కార్యదర్శి బొల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగదు సాయం అందజేస్తున్న బుద్ధప్రసాద్

బస్సుయాత్ర నిర్వహించే హక్కు వైసిపికి లేదు

● మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : సామాజిక బస్సుయాత్ర నిర్వహించే హక్కు వైసీపీకి లేదు అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. కే కొత్తపాలెంలో ఎస్సీ మహిళపై దాడి సంఘటనలో గాయాలపాలై మచిలీపట్నం వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం బుద్ధ ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ డ్రైవర్ను చంపి డోర్ డెలివరీ చేసిన చరిత్ర వైసీపీ నేతలదని, గౌడ బాలుని సజీవ దాహం చేసిన వైసీపీ పాలకులు పట్టించుకోలేదన్నారు. జగన్ మైకు పట్టుకుంటే నా ఎస్సీలు నా బీసీలు అంటారని, కే కొత్తపాలెం ఎస్సీలపై దాడి ఘటనలో సీఎం కనీసం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. పక్కనున్న మంత్రి జోగి రమేష్ పలకరించకపోగా అవనిగడ్డ ఎమ్మెల్యే కేసును నీరుగార్చి వైసిపి నేతను కాపాడుకున్నారన్నారు. నేరం చేసిన వాళ్లు ఇలా వెళ్లి అలా బయటకు వస్తే ఇక పోలీసుల పట్ల భయమేమి ఉంటుందని బుద్ధ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా బాధ్యత మహిళల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల వైద్య అవసరాల కోసం రూ పదివేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇలాంటి దాడులకు పాల్పడుతూ దాడి చేసిన వారికి బాసటగా నిలుస్తూ సామాజిక న్యాయం బస్సు యాత్ర చేసే అర్హత మీకు ఎక్కడిది అని బుద్ధ ప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దో వా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్బంధాలకు భయపడం : టిడిపి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులపై అక్రమ నిర్బంధాలు, అరెస్టు పెచ్చు మీరుతున్నాయని, భయపడే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం,దయాల రాజేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒగిరాల గ్రామానికి చెందిన సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు మేడికొండ సోంబాబును గురువారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకుని హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒగిరాలలో నిర్వహిస్తున్న సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వంశీ వస్తున్నారని, టీడీపీ నాయకులు గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తారని పోలీసులకు అందిన సమాచారం మేరకు సోంబాబు, తుమ్మల బ్రహ్మాజీలను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్రలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సోంబాబు, బ్రహ్మాజీలకు సంఘీభావం తెలిపారు. ప్రజలకు అందని సంక్షేమ పథకాల గురించి, ఇతర సమస్యల గురించి ప్రశ్నించడం కూడా నేరమన్నట్లు టీడీపీ నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్యాన్ని కునీచేయడమేనని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్ర, యనమదల సుధాకరరావు, రాచప్రోలు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సోంబాబు,తుమ్మల బ్రహ్మజీలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి నారాయణ నగర్ కాలనీలో ఉన్న గౌసియా మసీదును ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా గురువారం సందర్శించారు. చల్లపల్లి నారాయణ నగరులోని ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి గురించి కమిటీ పెద్దలు వారి దృష్టికి తీసుకువెళ్లారు. శ్మశాన వాటిక స్థలం మెరక, చుట్టూ ప్రహరీ నిర్మాణం, రోడ్డు నిర్మాణం, నీటి వసతి గురించి చర్చించారు. స్మశానంలో మధ్య నుంచి విద్యుత్ శాఖ వారి లైన్ ఉందని, దాన్ని స్మశానం బయటి నుంచి ఏర్పాటు చేసుకునేలా సిఫార్సు చేయాలని కోరారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మస్తాన్ వలీ తెలిపారు. ఆయనను కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎస్ఎంఎ షరీఫ్, కార్యదర్శి మతీన్, మహమ్మద్ సొహెల్, చల్లపల్లి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ నబీహోరీ, పాల్గొన్నారు. అలాగే ఇటీవల మాత వియోగానికి గురైన ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్ షాద్ నజరానాను ఇస్లాం నగరులోని వారి సోదరుడు కుతుబ్ షా ఇంటి వద్ద షేక్ మస్తాన్ వలి గురువారం పరామర్శించారు.

'మానవత' భవన నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : సమాజ అవసరాలు గమనించి సేవలందిస్తున్న మానవత సేవా సంస్థ నూతన భవన నిర్మాణానికి దాతలు తమ వంతుగా సహకారమందించడం అభినందనీయమని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తేళ్లమూడిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ జంక్షన్ శాఖ భవనానికి దాతలు 85వేల రూపాయలు విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమ 0లో కోశాధికారి' పాగోలు గణేష్ బాబు, భూమా పుల్లారావు, అక్కినేని రాఘవేంద్రరావు తదితరులు పాల్గొని దాతలను ఘనంగా సత్కరించారు.

రేపు దర్శనాలు నిలిపివేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామాలలో వేంచేసి యున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం లో ఈనెల 28వ తేదీ శనివారం రాత్రి రాహు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సంభవించునున్న కారణంగా శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి అమ్మవారి దర్శనాన్ని నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. తిరిగి 29వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి దర్శనం యధావిధిగా జరుగుతుందని తెలిపారు.

దిశ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతోపాటు సామాజిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలని పమిడిముక్కల ఎస్సై కిషోర్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోనితాడంకి, కపిలేశ్వరపురం, మంటాడ పాఠశాలల విద్యార్థులకు దిశా చట్టం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచే చట్టా లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లి దం డ్రులు సలహాలను ఎప్పటికప్పుడు పాటించాలని ఆయన సూచిం చారు. అనంతరం బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు మెరిసి శ్రీనివాసరావు, నారాయణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

ప్రజాశక్తి-గన్నవరం : ఈ నెల 26 నుండి వచ్చే నెల 25 తేది వరకు నెల రోజులు ఆర్టీసీలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం లోని 84 ముఖ్యమైన పట్టణాలలో ఈ కార్గో డోర్ డెలివరీ సౌకర్యం కలదని చెప్పారు. డోర్ డెలివరీ బుకింగ్ చేసుకొన్న యెడల,నామమాత్రపు అదనపు రుసుము తో,మీ పార్సెల్ తీసుకోవడానికి మీరు బస్టాండ్ కు వెళ్లకుండా, పార్సెల్ మీ ఇంటికి తీసుకువచ్చి డెలివరి ఇస్తారన్నారు. ఈ పట్టణాలలో 10 కి.మీ.దూరం పరిధిలోని ప్రాంతాలకు 50 కేజీల బరువు వరకు గల పార్సెల్లు డోర్ డెలవరీ ద్వారా బుకింగ్ చేసుకుని అతి తక్కువ ఖర్చుతో, వేగంగా మీ పార్సెల్ మరియు కొరియర్ కవర్లు పంపవచ్చన్నారు. 1 నుండి 6 కేజీ ల వరకూ 25 రూపాయలు, 6 నుండి 10 కేజీ ల వరకూ30 రూపాయలు,10 నుండి 25 కేజీ ల వరకు 40 రూపాయలు, 25 నుండి 50 కేజీ ల వరకూ 50 రూపాయలు కాగా అదనపు చార్జి తో మీ పార్సెల్, కొరియర్ కవర్లు మీ ఇంటి వద్దనే డోర్ డెలివరీ చేస్తామన్నారు. కావున ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించు కావలసినది గా కోరారు. **ప్రజాశక్తి ఉయ్యూరు** : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ప్రవేశ పెట్టిన కార్గో డోర్ డెలివరీ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు డిపో మేనేజర్ కెఎస్ఆర్కె ప్రసాద్ అన్నారు. సంస్థ చేపట్టిన కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం సందర్భంగా స్థానిక బస్ స్టాండ్ ఆవరణలో ప్రదర్శన నిర్వహించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భం గా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 84 ముఖ్య పట్టణాల్లో 50 కేజీల వరకు 10 కిలో మీ టర్ల విస్తీర్ణం వరకు డోర్ డెలివరీ సదుపాయం సంస్థ కల్పించిందన్నారు. ఈ అవకాశా న్ని ఏపీఎస్ ఆర్టీసీ కార్గో వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపో ఆఫీస్ సిబ్బంది, గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని కార్గో డోర్ డెలివరీపై అవగాహన కల్పించారు.

ఉయ్యూరులో మాసోత్సవాల ప్రదర్శన

తిరువూరును కరువు ప్రాంతంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువూరు పరిధిలో నీళ్లలేక ఎండిపోతున్న వరి పంటలను గురువారం నాయకులు పరిశీలించారు. తిరువూరు పట్టణంలోని రాకెట్, కట్టలేరు సప్లయ్ ఛానల్ పరిధిలో ఉన్న 14 చెరువులు నీరు లేక ఎండిపోయాయని, ఈ 20 ఏళ్లలో లేని కరువును మరలా చూడాల్సిన పరిస్థితి వచ్చిందని నాగేంద్ర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటను బతికించుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. పంటలు ఎండిపోతుండటంతో ఇప్పటివరకు ఎకరాకు అయిన రూ.25 వేలు నుండి 30 వేల వరకు చేసిన అప్పును ఎలా తీర్చాలో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో నియోజకవర్గంలో ఎండిపోయిన, ఎండిపోతున్న పంటలను సర్వే చేయించి తిరువూరు నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్వీ భద్రం, ఆకుల రవి, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక కమిటీ సమావేశం గురువారం డాక్టర్ మోహన్ రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ నందు జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాలు 2023 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రావు హాస్పిటల్ డాక్టర్ మామిడి శీతారామారావు, ఎన్టీఆర్ జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్, ఉపాధ్యక్షులు పట్ల కామేశ్వరరావు, కొండపల్లి ప్రధాన కార్యదర్శి ఎస్కె సర్దార్ సాహెబ్, కార్యదర్శి బి డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి పోటీలు నవంబర్ 10న, మండల స్థాయి పోటీలు నవంబర్ 30న, జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 17న, రాష్ట్రస్థాయి పోటీలు జనవరి 27, 28 తేదీల్లో జరుగుతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన జట్లు నవంబర్ 30న మండలస్థాయిలో ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో జరిగే పోటీలలో పాల్గొంటాయని తెలిపారు.

ఒకటిన తుది జాబితా

ప్రజాశక్తి-గంపలగూడెం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ, మార్పులకు, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గంపలగూడెం మండల వ్యవసాయ సహాయకులు తెలిపారు. జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ జాబితాలను పరిశీలించి తమ పంటలు వివరాలలో ఏమైనా మార్పులు ఉంటే రైతు భరోసా కేంద్ర అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 29 వరకు మాత్రమే ఉంటుందని పొరపాట్లు సరి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. నవంబర్ ఒకటో తేదీన తుది జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా ఖాదీ మహోత్సవ్

ప్రజాశక్తి-మైలవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఖాదీ మహోత్సవ్ కార్యక్రమాన్ని మండల విద్యా వనరుల విభాగం కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, పోటీలను నిర్వహించారు. వక్తృత్వ పోటీలలో ఎస్.కె గుల్నార్, ఎస్.మణిశంకర్, ఎన్.తేజశ్రీ నాగ సింధు లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతిని ఎస్.శృతి, జె. భార్గవ సాయి, ఎస్‌కె.అమీనా ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. మండల విద్యాశాఖ అధికారి బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు స్థానిక ఎస్.ఎస్.కె. ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యం బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలు మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు శుక్రవారం విజయవాడ బిషప్ అజరయ్య హైస్కూల్లో జరిగే జిల్లాస్థాయి పోటీలకు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

రేపు నెమలి ఆలయం మూసివేత

ప్రజాశక్తి-గంపలగూడెం: చంద్రగ్రహణం సందర్భంగా నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం ముఖద్వారాన్ని శనివారం ఆరు గంటల నుండి మూసి వేయనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. చంద్రగ్రహణం అనంతరం శుద్ధి చేసిన తరువాత ఆదివారం తెరవనున్నట్లు వివరించారు. యాత్రికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడు కంచికచర్లలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె శిల్ప గురువారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు ఆధ్వర్యంలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండలం లోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపిడిఓ తెలిపారు.

'ఈ క్రాప్‌లో అభ్యంతరాలను స్వీకరించాలి'

గౌరవరంలో జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-వత్సవాయి

వత్సవాయిలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాలకు చెందిన గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఓలకు జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు సి.భవాని సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించి, అభ్యంతరాలను నమోదు చేయాలన్నారు. అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట సబ్ డివిజన్ గ్రామాల్లో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుండి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం, గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు భవాని తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని గౌరవరం రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ నిమిత్తం పంట నమోదు ముసాయిదా జాబితాను గురువారం మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి పరిశీలించారు.

భాస్కరరావుకు నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొట్టా భాస్కరరావు ఆకస్మిక మృతి తీరనిలోటని వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. గురువారం వన్‌టౌన్‌లోని మాడపాటి క్లబ్‌లో బొట్టా భాస్కరరావు సంస్మరణ సభ జరిగింది. వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఏపీసీసీ నాయకులు కొలనుకొండ శివాజీ, మరుపిళ్ల చిట్టి కార్యాలయం అధ్యక్షులు పోతిన బేసికంటేశ్వరుడు, దుర్గా బ్యాంక్ మాజీ ఛైర్మన్ కొరగంజి ప్రభాకరరావు, బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మహదేవు అప్పాజీ, దుర్గా బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ అల్లం పూర్ణచంద్రరావు తదితరులు నివాళులర్పించారు.



దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ పరిధిలో గల కొత్తపేట నందు పైలా వారివీధి, పోతిన వారి వీధి మరియు బ్రహ్మం వాణి నందు "జోనల్ ఎంటమాలజీ". టీమ్ రాజమండ్రి అసిస్టెంట్ డైరెక్టర్ బియల్ఎన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని సందర్శించి ఆ గృహంలో ఉన్న నీటి నిల్వలను పరిశీలించారు. దోమల లార్వాలను గుర్తించి, లార్వాని నిర్మూలించడం, దోమలు పెరగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు గురించి తెలియపరిచారు. ప్రతి ఒక్కరూ రోజుల తరబడి తొట్టెలలో, డ్రమ్ములలో నీరు నిల్వ ఉంచకూడదని, ముఖ్యంగా నీరు నిల్వ ఉంచిన వాటిపై మూతలు ఉంచాలని కోరారు. లేదంటే నీటిలో దోమల వ్యాప్తి చెందటం వల్ల దోమల ఉత్పత్తి పెరిగి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మలేరియా అధికారి డా. మోతా బాబు, స్థానిక మెడికల్ ఆఫీసర్ వి.సునీల్, యన్‌యన్‌బిడిసిపి సుబంటీ పాల్గొన్నారు.

నిల్వ నీటితో దోమల లార్వాని పరీక్షిస్తున్న జోనల్ ఎంటమాలజీ కుమార్

దసరా ఉత్సవాలు విజయవంతం పట్ల సిపి అభినందనలు

ప్రజాశక్తి-విజయవాడ

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు అన్ని విధములుగా సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల వారికి స్వచ్ఛంద సంస్థల వారికి, మీడియా ప్రతినిధులు, ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్‌టిఆర్ జిల్లా, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఇతర జిల్లాల నుండి దసరా మహోత్సవాల బందోబస్త్ నిర్వహించడానికి వచ్చిన పోలీస్ అధికారులకు నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా శ్రీ కనకదుర్గ అమ్మవారి శేష వస్త్రం, ఫోటో, లడ్డు ప్రసాదం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 23 వరకు ప్రతిష్టాత్మకంగా జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేడుకలు ఘనంగా జరిగాయన్నారు. దసరా పర్వదినంతో పాటు, మూలా నక్షత్రం, విజయదశమి, రోజుల్లో భక్తుల రద్దీ దృష్ట్యా నగర ప్రజలకు ట్రాఫిక్ క్రమబద్దీకరిస్తూ, ఎక్కడా కూడా దొంగతనాలు జరుగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అంకిత భావంతో పని చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిపి విశాల్ గున్ని, డిసిపి అజిత వేజెండ్ల, సి.ఎస్.డబ్ల్యూ డిసిపి ఉదయరాణి, అడ్మిన్ డిసిపి ఎం.సత్తిబాబు , క్రైమ్ ఎడిసిపి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నం డిపోలో ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 84 ప్రదేశాల్లో 10 కిలోమీటర్ల వరకు 50 కిలోల బరువు వరకు డెలివరీ సౌకర్యం అందిస్తున్నామని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కేవలం 24 గంటల్లోపే అనుకున్న ప్రదేశానికి డోర్ డెలివరీ జరుగుతుందని చెప్పారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ పండగ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో గ్యార్వీ షరీఫ్ పండుగను ఘనంగా నిర్వహించారు. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో గౌసెపాక్ చిహ్నంగా భారీ జెండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త వంశీయులు బాగ్దాద్ నగరంలో వెలసి ఉన్న మహనీయులు జగద్గురువులు షేక్ మహబూబ్ సుభాని వారిని స్తుతిస్తూ గ్యార్వీ పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు షేక్ ముస్తఫా, కోశాధికారి కరిముల్లా, షేక్ సర్వర్ సాహెబ్, దావుద్, హాసన్ అహ్మద్, అలీఫ్ ఖాన్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన వెలివల పద్మారావు అనే వ్యక్తి అక్రమ మద్యం తరలిస్తుండగా దొరికినట్లు స్థానిక ఎస్సై పి రాంబాబు తెలిపారు. ఆంధ్ర-తెలంగాణ బోర్డర్ రాజవరం వద్ద గురువారం తెలంగాణకు సంబంధించి 10, ఆంధ్రకి సంబంధించి 8 బాటిళ్ల మొత్తం 2380 రూపాయల విలువ గల మద్యం దొరికినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

పోలీస్ విధులపై అవగాహన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల పోలీసు స్టేషన్లో విద్యార్థులకు శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ పివియస్ సుబ్రహ్మణ్యం పోలీసుల విధులు, పోలీస్ స్టేషన్ పనితీరు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ లో ఎఫ్ ఐ ఆర్ నమోదు, వెపన్ వాడకం, రికార్డులు, కేసుల వివరాలు, సెక్షన్లు, తదితర విషయాలు, పోలీసులు విధుల గురించి వివరించారు. పోలీసులు విధులకు ఆటంకం కలగకుండా నడుచుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజారక్షణ భేరి' గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చల్లపల్లి : వచ్చే నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని చల్లపల్లి సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో ప్రచార భేరి గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజల ఐక్యంగా కథలాలని మరో మహెూద్యమం కోసం సిపిఎం పార్టీ ప్రచార భేరి మోగిస్తుందని అందరూ కదలాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని విడగొట్టి పది సంవత్సరాలైనా ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ లాంటి హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య, విద్య ప్రైవేటీకరణ చేయటం వలన సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి భారంగా. మారాయి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్పోరేట్ సేవలో తరిస్తూ గంగవరం మేజర్ పోర్టల్ తో పాటు రాష్ట్ర ప్రజల సంపదను ఒక్కొక్కటి కట్టపెడుతున్నారని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపులు కార్డు లేక బ్యాంకు రుణాలు అందటం లేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజల ఐకమత్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు చౌటపల్లి రవి, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, సిపిఎం పార్టీ నాయకులు బండారు కోటేశ్వరరావు, మేడంకి వెంకటేశ్వర రావు, కలపాల దావీదు, బళ్లా వెంకటేశ్వరరావు, లంకపల్లి సత్యం,పెయింటర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికునికి చెక్కు అందజేస్తున్న సీతారామదాస్

చక్కెర పరిశ్రమలో సంస్కరణలకు ఆద్యుడు విఎం రావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : చక్కెర పరిశ్రమలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి రైతు, పరిశ్రమ అభివద్ధికి కషి చేసిన సంస్కర్త వెలగపూడి మారుతీరావు అని కేసీపీ చక్కెర కర్మాగార ఉయ్యూరు యూనిట్ హెడ్ వై. సీతా రామదాస్ అన్నారు. కేసీపీ షుగర్స్ అండ్ ఇండస్ట్రీస్ మాజీ ఎండి వెలపూడి మారుతీరావు 91వ జయంతి కర్మాగార ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సీతారామదాస్ ఇతర ఉద్యోగులు పూలు మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కెర పరిశ్రమ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రోజుల్లో పరిశ్రమ భవిష్యత్తుకు, చెరకు పండి 0చే రైతులకు గిట్టుబాటు అయ్యేందుకు పలు సంస్కరణలు చేపట్టి సూచనలు చేశార ని గుర్తుచేశారు. మారుతీరావు జయంతి నాణ్యతా దినోత్సవంగా పాటిస్తున్న సందర్భం గా నాణ్యతా ఫలకాన్ని ఆవిష్కరించి యూనియన్ నాయకుడు బాలసుబ్రమణ్యంతో కలసి కార్మికుల నాణ్యతా ప్రతిజ్ఞచేయించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన 15 మంది కార్మికులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 3లక్షల చెక్కులు అందజేశారు.

మారుతీరావు విగ్రహానికి నివా ళు లర్పిస్తున్న సీతారామదాస్

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గల స్విమ్మింగ్ పూల్, ఈడ్పుగల్లు, కంకిపాడు మండలంలో "పే అండ్ ప్లే " పధకము లో స్విమ్మింగ్‌లో శిక్షణ ఇచ్చుటకు అర్హత గల శిక్షకులు, లైఫ్ సేవర్స్ ఉద్యోగాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. కావున పై ఉద్యోగాలకు కొరకు ఆసక్తి కలిగిన శిక్షకులు, లైఫ్ సేవర్స్ తమ క్రీడలో సాధించినటువంటి ప్రతిభకు సంభందిచిన ధ్రువ పత్రాలు, శిక్షకులుగా అనుభవ కలిగిన పత్రాలు, విద్యార్హతలు సంభంధిచిన నకలు, ఆధార్ కార్డు ఈ మెయిల్ dsakrishna1@gmail.com కు ఈ నెల 31 లోగా పంపించాలని కోరారు. ఇతర వివరా లకు కృష్ణా జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకురాలు ఝాన్సీలక్ష్మి (మొబైల్ 9494643658) నుసంప్రదించాలన్నారు.

బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శిగా బి సునీత బుధవారం బాధ్యతలు చేపట్టారు. పమిడిముక్కల మండలం తాడంకి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ అదనపు బాధ్యతలుగా వెంట్రప్రగడ గ్రామపంచాయతీని కూడా తీసుకున్నట్లు సునీత తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు : వంశీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : జగనన్న సురక్ష శిబిరాలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి నాంది పలికారని మ్మెల్యే వంశీ అన్నారు. గురువారం బాపులపాడు మండలం ఓగిరాల గ్రామంలో సర్పంచ్ ఖగా పద్మావతిలతో కలిసి ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి చాగంటి ఆంజనేయులు పర్యవేక్షణలో డాక్టర్ మంజూష 611 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.మ్మెల్యే వంశీ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.అనంతరం వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటక రంగ డైరెక్టర్ నక్క గాంధీ, ఎంపీపీ ఎర్రగొల్ల నగేష్, జడ్పిటిసి గంగా భవాని, అవిర్నేని శేషగిరిరావు, ఎర్రంచెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వంశీ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం కేసరపల్లి గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా గురువారం ఏర్పాటు చేశారు. ఈ అవగాహనా కార్యక్ర మంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్ళద్దు అని, తెలిసో తెలియక మాదకద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దు అని, ఎటువంటి మత్తు పధార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమే అని, స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలన్నారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కంగిపోతారన్నారు. చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాద స్థాయికి చేరుకుంటరని, క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు టి నరేష్, నవ జీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ యస్ కె నజ్మా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్దులు పాల్గొన్నారు.

రైతుబజారులో ధరల దోపిడీ

• వినియోగదారుల జేబులకు చిల్లులు

రైతు బజార్లో కూరగాయ దుకాణాలు



ధరల పట్టిక

ప్రజాశక్తి-గన్నవరం : రైతు బజారు అధికారుల అలసత్వం వ్యాపారుల మొండితనం వెరసి వినియోగదారులు జేబులకు చిల్లులు పెడుతుంది. వివరాల్లోకి వెళితే నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం రైతు బజారులో అధికారులు నిర్ణయించిన ధరలకంటే కూరగాయలు, ఆకుకూరలు అధిక ధరలపై విక్రయిస్తుంటే వినియో గదారులు బెంబేలెత్తుతున్నారు. ఈ విష యమై ఎన్ని సార్లు రైతుబజార్ అధికారులకు, సిబ్బందికి కంప్లెయింట్ చేసినా చర్యలు మాత్రం శూన్యం.అధిక ధరలకు విక్రయిస్తున్నారని వ్యాపారులను అడిగితే బోర్డ్ రేటు పై అమ్మితే మాకు నష్టం వస్తుందని నా రేటు ఇంతే.. ఇష్టం ఉంటే కొనండి లేకపోతే వెళ్ళండి అంటూ కటువుగా సమాధానం చెపుతున్నారని వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తూకంలో కూడా వ్యత్యాసం ఉందంటూ చెబుతున్నారు. ముఖ్యంగా గురువారం 1వ నెంబరు షాపు లో ఆకుకూరలు బోర్డ్ రేటుపై కట్టకు 5 రూపాయలు అదనంగా, 47వ షాపులో కూరగాయలు బోర్డ్ రేటుపై కేజికి 10 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా పలు షాపులలో అధిక ధరలు వసూలు చేస్తున్నారంటూ గురువారం రైతుబజార్ కు వచ్చిన పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే రైతు బజారు ఎంట్రన్స్ గేటు వద్ద వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారుల నుండి నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారని, అలాగే రైతుబజార్ లో షాపులు నుండి మెయింటెనెన్స్ పేరుతో వారానికి ఒక్కో షాపు నుండి రూ.200 నుండి రూ.300 వరకూ వసూళ్ళు చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఆ ధీమాతోనె షాపు నిర్వాహకులు అధికారులు,సిబ్బంది భయం లేకుండా యధేచ్ఛగా బాహాటంగా అధిక ధరలపై కూరగాయలు ఆకుకూరలు విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు వాపోతున్నారు ఇప్పటికైనా పై అధికారులు స్పందించి రైతుబజార్ లో అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు గురువారం నుండి ప్రారంభమైనట్లు ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. 26న పురిటిగడ్డ, 27న వక్కలగడ్డ, 30న వెలివోలు, యార్లగడ్డ, 31న నడకుదురు, నవంబర్ 2న చల్లపల్లి, 3న పాగోలు, 4న లక్ష్మీపురం, 6న మంగళాపురం, 8న మాజేరు, 10న ఆముదార్లంకల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సభల ద్వారా చేపట్టవలసిన పనుల గుర్తింపు, ప్రణాళిక రూపకల్పన, ఆమోదం పొందనున్నట్లు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న రవీంద్రబాబు

రవీంద్రబాబుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎస్ఏఈ ఇంటర్నేషనల్, యు.ఎస్.ఏ. అనుబంధ సంస్థ అయిన ఎస్ఏఈ ఇండియా ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక ఎస్ఏఈ లీడర్ షిప్ అవార్డు 2022-23 సంవత్సరానికి స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్య సలహాదారు, ప్రొఫెసర్ డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబుకు దక్కింది. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్-ఎస్ఏఈ ఇండియా సదరన్ సెక్షన్, అమరావతి డివిజన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలను స్వీకరించినప్పటి నుండి ఎంతో సమర్ధవంతమైన నాయకత్వ మందించినందుకు ఎస్ఎఇ ఇండియా సదరన్ సెక్షన్ అభ్యున్నతికై ప్రామాణికమైన సేవలందించినందులకు ఎస్.ఏ.ఈ. ఇండియా ప్రతిష్టాత్మక లీడర్ షిప్ అవార్డును డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్ఎన్ఆర్వి ప్రసాద్ తెలిపారు. చెన్నై లో ఈనెల 21 న జరిగిన ఎస్.ఎ.ఇ ఇండియా సదస్సులో ఈ అవార్డును అందుకున్నట్లు ప్రసాద్ తెలియజేశారు.

గృహాల క్రమబద్ధీకరణపై పరిశీలన : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఇందిరాగాంధీ లేబర్ కాలనీ నివాసితులకు చెందిన గృహాలను క్రమబద్ధీకరించేందుకు చట్ట ప్రకారం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. మధురానగర్‌లోని ఇందిరాగాంధీ లేబర్ కాలనీలో నివాసం ఉంటున్న నివాసిత ప్రాంతాలను గురువారం ఆయన రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేబర్ కాలనీ న్యూ టౌన్‌షిప్-7లోని ఆరు ఎకరాల 92 సెంట్ల విస్తీర్ణంలో 201 మంది నివాసముంటూ తమ గృహాలను క్రమబద్ధీకరించాలని కోరారని, వాటిని చట్ట ప్రకారం క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నార్త్ తహాశీల్దార్ యం.మాధురి, సర్వేయర్ ప్రసాద్ నాయక్, వీయంసి టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

గుణదల ఫ్లైవోవర్ ఉద్యమంపై పోలీసుల ఉక్కుపాదం

అరెస్టు చేశారు. అనంతరం గుణదల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అరెస్టు చేసిన నేతలను స్టేషన్లో ఉంచిన దృశ్యం

అరెస్టయిన వారిలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు టి.ప్రవీణ్, పి.కష్ణమూర్తి, షేక్ షకీలా, ఎస్‌కె.ఆషా, కె.కష్ణ, మురారి, భాష, నాగేశ్వరరావు, గోవింద్ ఉన్నారు. మొత్తం 15 మంది ఫ్లైవోవర్ సాధన కమిటీ, సిపిఎం నేతలను అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అంతేగాక నిరసనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ప్రజలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేశారు. అరెస్టు చేసిన నేతలను, స్థానిక ప్రజలను సాయంత్రం వరకు నిర్బంధించి ఆ తర్వాత ఎట్టకేలకు విడుదల చేశారు. స్థానిక శాసన సభ్యుడి వొత్తిడితో పోలీసులు వ్యవహరించిన తీరును గుణదల ఫ్లైఓవర్ సాధన కమిటీ తీవ్రంగా ఖండించింది.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ఫ్లైవోవర్ వద్ద నిరసన

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. మూడు ప్రభుత్వాలు, ఐదుగురు ముఖ్యమంత్రులు మారినా 14 ఏళ్ల 8 నెలల క్రితం ప్రారంభించిన గుణదల ఫ్లైఓవర్‌ను పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. మొండి గోడలతో సరిపెట్టారన్నారు. దానికి శిలాఫలకం వేసి ఇప్పటికి 5360 రోజులు పూర్తయ్యాయన్నారు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. రైల్వే ట్రాక్ పైన గేటు వేస్తే ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇక్కడ గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయని, ఎంతో మంది క్షతగాత్రులయ్యారని, కొందరు మరణించారని గుర్తుచేశారు. పాత వంతెనలు రవాణాకు ఉపయోగపడవని నిపుణుల చెప్పినప్పటికీ వైసిపి ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు మల్లాది విష్ణు పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. ప్రజలు నరకయాతన పడుతున్న నేపథ్యంలో స్థానికంగా ఉండే పెద్దలు, మహిళలు పార్టీలకతీతంగా గుణదల ఫ్లైఓవర్ నిర్మాణ సాధన కమిటీని ఏర్పాటు చేసుకుని దశలవారీగా పలు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం మహాధర్నాకు సిద్ధమయ్యారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాల్సిందిపోయి అరెస్టులకు పూనుకోవడం శోచనీయమన్నారు. మహాధర్నాను విఫలం చేయడానికి స్థానిక ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు పోలీసుల ద్వారా ప్రయత్నించారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపి గుణదల ఫ్లైఓవర్‌ను వచ్చే ఎన్నికలలోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నిర్బంధాలు గర్హనీయం

వెళుతున్న బాబూరావును మార్గమధ్యంలోనే అడ్డగించి నిర్బంధించి అరెస్టు చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఆయనతోపాటు పలువురు జిల్లా కమిటీ సభ్యులను, స్థానిక నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లో ఉంచటం గర్హనీయమని పేర్కొన్నారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి గుణదల ఫ్లైవోవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నేతలను విడుదల చేయాలని కోరారు. ఫ్లై ఓవర్ సాధన కమిటీ జరిపే ఆందోళనలకు తమ పార్టీ పూర్తిమద్దతు ఇస్తోందని డివి.కృష్ణ తెలిపారు.

అరెస్టులు సిగ్గుచేటు

నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక శ్రీశ్రీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్లైవోవర్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఎంఎల్‌ఎ విష్ణు ధర్నాను విచ్ఛిన్నం చేయటానికి పోలీసుల ద్వారా ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి నిర్బంధం ద్వారా ప్రజల గొంతు నొక్కాలని చూడడం గర్హనీయమన్నారు. ఇటువంటి నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. తక్షణం ఫ్లైవోవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ముఖం చాటేసిన వర్షాలు

కురవకపోవడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి లభ్యత తగ్గింది. పులిచింతల, పట్టిసీమ ప్రాజెక్టుల నుంచి నీరు తక్కువగా విడుదల చేయడం సమస్యగా మారింది. అక్టోబర్లో వర్షాలు ముఖం చాటేయడం, ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో వరి పంటకు వారానికి ఒక తడి నీటినే అందించాల్సి వస్తోంది. కాల్వల శివారు భూములకు నీరందక పంటలు ఎండుతున్నాయి.

నత్తనడక

నెలకొంది.

రీజనల్ ప్రయోగశాలే గతి

ఇదిలా ఉంటే రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న రీజినల్ ల్యాబొరేటరీనే స్టేట్ ల్యాబొరేటరీగా మార్పుచేశారు. ఇది గతంలో ప్రాంతీయ ప్రయోగశాల అయినందున అందుకు అనుగుణంగానే వసతులు ఉన్నాయి. ఏడాదికి 2,500 నుంచి 3వేల శాంపిల్స్‌ను మాత్రమే పరీక్షించేలా ల్యాబ్‌లు సౌకర్యాలు ఉన్నాయి. అందుకు తగినట్లుగానే సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే స్టేట్ హెడ్ క్వార్టర్‌గా దీనిని మార్చడంతో సమస్యలు నెలకొన్నాయి. ల్యాబ్‌లతోపాటు సిబ్బంది కొరత సమస్య తీవ్రంగా మారింది. 20 నుంచి 25 మంది వరకు టెక్నీషియన్లు ఉన్నారు. ఏడాదికి సుమారు 4వేల నుంచి 7వేల వరకు శాంపిల్స్‌ను పరీక్షించాల్సి వస్తోంది. నమూనాలకు ఏపిఐ, ఫోర్ములేషన్స్, బయలాజికల్స్, కాస్మోటిక్స్ వంటి అనాలిసిస్‌లు చేయాల్సి ఉంటుంది. దీనికి తగ్గట్లుగా సిబ్బంది, ల్యాబ్‌లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సతమతమవుతున్నారు. ఫలితాలు ఆలస్యంగా రావడంతోపాటు కేసుల నమోదు ప్రక్రియలో కూడా జాప్యం నెలకొంటోంది. గత తొమ్మిదేళ్లగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి.

కౌలు రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉదారంగా రుణాలివ్వాలి

రుణాలు ఇవ్వాలని సూచించారు. తీర ప్రాంతం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. పిఎంజిఎస్‌వై పథకం కింద గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న డ్రైన్లపై బ్రిడ్జిలు, రహదారుల పనులు వెంటనే చేపట్టాలన్నారు. రూ.7 కోట్ల సిఎస్‌ఆర్ నిధులను సద్వినియోగించుకుని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీటి పనులు చేపట్టాలన్నారు. నగరంలో మీటింగ్ హాల్ నిర్మాణానికి సిఎస్‌ఆర్ నిధులు కేటాయించి సహకరించాలని బ్యాంకర్లను కోరారు. అవసరమైన డిపిఆర్ సిద్ధం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతున్నందున పీఎం గతి శక్తి కింద మచిలీపట్నం- రేపల్లె రైల్వే కనెక్టివిటీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల అభివద్ధికి ఆర్‌ఓబి లేదా అండర్ పాస్‌ల ఏర్పాటుకు కేంద్ర మంత్రి, అధికారులతో చర్చించామని తెలిపారు. రూ.5 కోట్ల సిఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచి, ఆధునిక ఎక్యుప్‌మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరో 2.50 కోట్ల సిఎస్‌ఆర్ నిధులతో కేన్సర్ స్క్రీనింగ్ ఎక్విప్మెంట్, అవసరమైన వైద్య సిబ్బందితో హైటెక్ బస్సు సిద్ధం చేస్తున్నామని, త్వరలో ఇది అందుబాటులో వస్తుందని చెప్పారు. విద్యుత్ ఛార్జీల భారం తగ్గించేందుకు ప్రతి ఆస్పత్రిలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. గూడూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ తరకటూరు ఎస్ఎస్ ట్యాంక్ నుంచి అదనంగా 4 ఎంఎల్‌డి నీటి అవసరాన్ని దష్టిలో ఉంచుకొని గూడూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై కూలంకషంగా చర్చించినట్లు చెప్పారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ పిఎంఇజిపి పథకం కింద నిరుద్యోగులకు యూనిట్లు మంజూరు చేసి బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. రూ.4.15 కోట్ల సిఎస్‌ఆర్ నిధులతో తాగునీటి పథకాల అభివద్ధి, ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ ఒప్పంద పత్రాలను పరస్పరం అందజేసుకున్నారు. ఈసమావేశంలో ఎస్‌బిఐ జిఎం కె.ప్రవీణ్ కుమార్, ఇండియన్ బ్యాంక్ జిఎం గణేష్ రామన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

బందరు కమిషనర్‌పై విరుచుకుపడ్డ ఎంపి

"రానున్నది ఎన్నికల సమయం... మీరు వ్యవహరించే తీరును ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు.. మచిలీపట్నం అన్నా, ఇక్కడి ప్రజలన్నా మీకెందుకంత కోపం.. నగరాభివద్ధికి సహకరించరు... నిధులు రానియ్యరు... వచ్చిన నిధులు ఖర్చు పెట్టరు..." అంటూ మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ చంద్రయ్యపై బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి తీవ్రంగా విరుచుకుపడ్డారు. మచిలీపట్నంలో డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి ముఖ్యమంత్రితో మాట్లాడి రెండెకరాల స్థలాన్ని మంజూరు చేయించానని, రూ.250 కోట్లతో నిర్మించే ఈ భవనానికి యూనియన్ బ్యాంక్ రూ.40 కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చిందని అన్నారు. అయినా ఇప్పటి వరకు ఆ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయలేదన్నారు. దీంతో భవన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు కేంద్ర ప్రజాప్రతినిధులకు, ప్రతిపక్ష పార్టీలకు అర్జీలు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మచిలీపట్నం వచ్చిన ప్రతిసారీ వారు తనకు అర్జీలు ఇస్తుంటే తాను ఏం సమాధానం చెప్పాలన్నారు. ఆ భవన నిర్మాణానికి ఎందుకు అనుమతులు మంజూరు చేయడం లేదని కమిషనర్‌ను నిలదీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలన్నారు. ఇప్పటికే ఈ విషయంపై మూడు సమావేశాల్లో చర్చ జరిగిందన్నారు. దీంతో కమిషనర్ స్పందిస్తూ నూతన మేయర్ బాధ్యతలు చేపట్టడం వల్ల కొంత ఆలస్యమైందన్నారు. కౌన్సిల్ సమావేశం కూడా జరగలేదన్నారు. దీంతో అనుమతుల మంజూరుకు కౌన్సిల్ అజెండాలో పెట్టలేదని బదులిచ్చారు. కమిషనర్ సమాధానానికి సంతప్తి చెందని ఎంపీ...ఏడాదికాలంగా ఈ విషయంపై చర్చిస్తున్నాం, ఈ కాలంగా ఎన్ని కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నూతన మేయర్ ఎన్నిక గురించి చెబుతారేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కాలంలో ఎన్ని నూతన భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారో తనకు రాతపూర్వకంగా జవాబు ఇవ్వాలని కోరారు. 'మీ అశ్రద్ధ, అనాలోచిత చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూన్నారు...ఇది రాష్ట్ర ప్రభుత్వంపై వేరేవిధంగా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. చిన్నపాటి వర్షానికే నగరం ముంపునకు గురవుతోందని, దీనికి ప్రధాన కారణం డ్రైనేజీ సమస్యని అన్నారు. ఈ సమస్య పరిష్కారం నిమిత్తం సముద్ర మట్టంపై అధ్యయనం చేసి పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉండాలని సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బందాన్ని పంపుతానని చెప్పిందని, ఇందుకు సమయం ఇవ్వాలని ఆరు నెలల క్రితం కేంద్ర బృందం ఈమెయిల్ ద్వారా మీకు సమాచారం ఇస్తే ఇప్పటివరకు ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నించారు. తాను కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ నగరపాలక సంస్థకు లేఖ పంపినా సమాధానం ఇవ్వలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో చరిత్ర ఉన్న బందరును అభివద్ధి చేయడానికి కషి చేస్తుంటే...వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకుండా ఇటువంటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. ఇప్పటికైనా బందరు అభివద్ధికి సహకరించాలని కోరారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎంపి

IN THE HIGH COURT OF JUDICATURE AT MADRAS

WMP No. 21942 of 2023 in W.P.No. 1573 of 2023

Mr.N.RAJAN, Son of S. Natarajan,
.....**Petitioner**

-Vs-

The Secretary,
Madras High Court,
Co-Operative Society Ltd.,
Chennai-600 104 and Others.
.....**Respondents**

To,

1. Mrs. I. Rama devi,
Wife of. I.Ananda Rao,

2. I. Durgabhavani,
Daughter of. I.Ananda Rao,

3. I. Nagalakshmi,
Daughter of. I.Ananda Rao,

4. I.Nagapani kumar,
Son of. I.Ananda Rao,

All are residing at
D.No. 19/28/46D, Sarkar Thota,
Machilipatnam, Krishna District-521002.

You are requested in the above writ petition before the Hon'ble High Court appear in person or through your counsel on 09-11-2023 at 10.30 A.M. failing which the case will be decided in your absence.

M.Mohamed Hasain,
Counsel for Petitioner.

ప్రకటన
మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో

E.A. No. 189/2021 in E.P. No. 33/2019 in O.S. No. 29/2017

బిట్వీన్
వీర్ల కన్యాకుమారి ... పిటీషనరు / క్లయిము పిటీషనర్
అండ్
1. గార్లపాటి కృష్ణమూర్తి వగైరాలు ... రెస్పాండెంట్సు
రెస్పాండెంట్ నెం.4 : బుర్రా శ్రీలక్ష్మి, భర్త : లేటు సోమిరెడ్డి, వయస్సు 32 సం॥లు, హిందువు, డోర్ నెం. 15-71బి, ఆంజనేయపేట, గుడివాడ, కృష్ణాజిల్లా.

పై నెంబరుగల క్లయిము పిటీషనులో 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేసియున్నారు. కావున పై నెంబరు ఇ.ఎ.లో మీ హాజరు నిమిత్తం ది. 07-11-2023న వాయిదా వేసినారు.కాబట్టి మీరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీకు పరోక్షముగా విచారణ జరిపి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 07-11-2023

రావూరి రవికుమార్,
గుడివాడ. **న్యాయవాది, గుడివాడ.**
26-10-2023 **సెల్ : 9985117543.**

మహారాజశ్రీ నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

1 A 88/2022 in OS 187/2022

Between:

ఉప్పులూరి జవహర్ బాబు
పిటిషనర్/వాది

VS

1. **వడ్డెల్లి లక్ష్మీనారాయణ**
2. **శ్రీమతి శ్రీరాంరమాదేవి**

రెస్పాండెంట్స్ ప్రతివాదులు

పై నెంబరు 1A పిటిషన్ నందు పిటిషనర్, పై వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసు కొనగా ఒకటవ రెస్పాండెంట్ అయిన వడ్డెల్లి లక్ష్మీనారాయణ నోటీసు తీసుకోనందున ఒకటవ రెస్పాండెంట్‌కి నోటీసులు అమలు చేయునిమిత్తం ది. 07-11-2023 తేదీన వాయిదా వున్నది. 1వ రెస్పాండెంట్ ది. 07-11-2023 తేదీన పై శ్రీకోర్టు వారి ముందు స్వయంగా గాని, న్యాయవాది ద్వారాగాని హాజరై తన వాదనలను వినిపించుకోవల్సిందిగా కోరడమైనది. లేనియెడల 1వ రెస్పాండెంట్ పరోక్షమున విచారణ జరుగునని తెలియజేయునది.

ఇట్లు **కాట్ర సత్యనారాయణ**
పిటిషనర్ తరపు న్యావవాది
నందిగామ
ది. 27-10-2023, నందిగామ

పాస్‌పోర్ట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ గ్రామ వాస్తవ్యులు కొత్త ధాత్రి పూజిత తండ్రి ప్రసాదరావు చెందిన పాస్ పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం. **S7633303.** జిరాక్స్ నిమిత్తము గాంధీ సెంటర్ కు బైక్ పై వెళు చుండగా, మార్గ మధ్యంలో పాస్ పోర్ట్ జారి పోయినది. సదరు పాస్ పోర్ట్ దొరికిన వారు సెల్ నెం. 8142227314 కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికము ఇవ్వబడును.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు మరియు కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలం, ఉయ్యూరు నగర పంచాయతీ ఏరియాలోని అంబేద్కర్ నగర్, డోర్ నెం. 13-92 రు కాపురస్తులు గూడపాటి మరియన్న (లేటు) గారి భార్య గూడపాటి పుష్పలీల గారు నాకు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు ది. 10-10-2023న మధ్యాహ్నం 12-00 గం.ల సమయంలో ఉయ్యూరు నగర పంచాయతీ ఏరియాలోని కాటూరు రోడ్డులో గల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి మరియు శివాలయం రోడ్డులోని సబ్ ట్రెజరీ ఆఫీసుకి వెళు చుండగా నా క్లయింటు భర్తగారైన గూడపాటి మరియన్న గారి సర్వీస్ పెన్షన్ పుస్తకం నెం. **PPO No.Edn/KNA/SP-007078/96-97, PPO ID 05024519** ఒరిజినల్ దారి మార్గంలో ఎక్కడో జారిపోయినది. నా క్లయింటు మరలా వెనుకకు వెళ్లి చూసినప్పటికి దొరకలేదు. కావున సదరు నా క్లయింటు భర్త గారైన గూడపాటి మరియన్నగారి సర్వీస్ పెన్షన్ పుస్తకం నెం.**PPO No.Edn/KNA/SP-007078/96-97, PPO ID 05024519** ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింద తెలిపిన నా అడ్రస్సుకు తెచ్చి ఇచ్చుట గాని లేక నా సెల్ నెంబర్ తెలియజేయుట గాని చేయవలసినదిగా తెలియజేయడమైనది.

ఉయ్యూరు.
ది.26-10-2023

ఇట్లు
నన్నం సుదర్శనరావు, అడ్వకేట్,
శివాలయం బజారు,
ఉయ్యూరు - 521 165.
సెల్ : **9959484330, 8328127725**

చంద్రబాబును విడుదల చేయాలని నిరసనలు

అవనిగడ్డలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులను రద్దుచేసి ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన తెలిపారు. గురువారం రాజీవ్ సెంటర్లో టిడిపి నాయకులు కార్యకర్తలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే రాఘవ, బం డే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి.-తోట్లవల్లూరు : చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన ఆయన్ని ప్రజల నుండి దూరం చేయలేరని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ, చంద్రబాబుతోనే మేమున్నామని చెబుతూ 'బాబుతో నేను' కార్యక్రమాన్ని మండలంలోని చాగంటిపాడు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు కోటి రెడ్డి, కళ్ళ వంశీకష్ణారెడ్డి, మట్ట అమత బాబు, గ్రామ పార్టీ కార్యదర్శి డొక్కు నాగరాజు, చిన్నం కోటేశ్వరావు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : చంద్రబాబు అక్రమ అరెస్టుతో తెలుగుదేశం ప్రభంజనాన్ని ఆపలేరని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం రాత్రి గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో బాబు గారి అక్రమ ఆరెస్ట్ కండిస్తు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం టీడీపీ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ

గన్నవరం మండలం పురుషోత్తపట్నంలో...

తోట్లవల్లూరు మండలంలో...

చంద్రబాబును కావాలని ఒక పథకం ప్రకారం అరెస్టు చేసి సెంట్రల్ జైల్లో పెట్టారని, న్యాయపోరాటం ఆగదన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: 18 సంవత్సరాలు నిండిన వారి సమాచారం బయటకు వెల్లడించకూడదని చట్టంలోనే ఉన్నా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న రవి భార్గవ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన నగర అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ డిమాండ్ చేశారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో పోతిన మహేష్ మాట్లాడుతూ విజయవాడ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఆశ్రయం పొందుతున్న టువంటి మైనార్టీ తీరని 200 మంది బాలికల సమచారాన్ని రవి భార్గవ్ అనే అధికారి ఎందుకు సేకరిస్తున్నారని, అక్కడ ఆశ్రయం పొందుతున్నటువంటి ఆడపిల్లల సమాచారాన్ని సేకరించి రవి భార్గవ్ ఎవరికి పంపుతున్నారని దీని వెనకాల ఏ రాకెట్ ఉందో తేలాల్సి ఉందన్నారు. ఈ సేకరించిన సమాచారాన్ని మీరు ఎవరికైనా అమ్ముతున్నారా లేక ఎవరికైనా పంపుతున్నారని అని బాలికల అదృశ్యం వెనుక మీహస్తం ఎంతవరకు ఉందని ప్రశ్నించారు. దీని మీద విజయవాడ నగర పోలీస్ కమిషనర్ విచారణ చేపట్టాలని, మహిళ కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ ఈ దుర్ఘటనల మీద దష్టి సారించాలన్నారు. ఈ సంఘటన మీద స్పందించాలని ఈ రవి భార్గవ్ చేస్తున్నటువంటి చర్యల మీద విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

లిప్ కరదీపిక ఆవిష్కరిస్తున్న ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, అధికారులు

రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అభ్యసన, అభివద్ధి కార్యక్రమం (లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రామ్) ద్వారా తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, నైపుణ్యాలు మెరుగుపరచవచ్చని సమగ్ర శిక్ష పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆంధ్రా లయోలా కళాశాల 'ఎస్ జే సెంటర్ ఫర్ ఎక్స్ లెన్స్' లో సమగ్ర శిక్ష, సిప్స్, సేవ్ ది చిల్డ్రన్, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలోమూడు రోజులపాటు జరిగే రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్సు పర్సన్లు, ఐదు జిల్లాల (కడప, అనంతపురం, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం) నుండి 120 మంది రిసోర్సు పర్సన్లను ఉద్దేశిస్తూ క్షేత్ర స్థాయిలో విద్యాబివృద్ధి కృషి చేస్తే విద్యావ్యవస్థలో పెనుమార్పులు సష్టించవచ్చున్నారు. ఈ సందర్భంగా లిప్ కరదీపిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డా. కె.వి.శ్రీనివాసులురెడ్డి , శామో జేడీ బి.విజయ్ భాస్కర్ , శామో ట్రైనింగ్ అండ్ ప్రొగ్రామింగ్ ఆఫీసర్ కల్పనా శైలా, సిప్స్ (సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్) డైరెక్టర్ వల్లి మానిక్యం, మేనేజర్ ఉపేందర్ రెడ్డి, సేవ్ ద చిల్డ్రన్ ప్రతినిధులు మల్లాడి నగేష్, ప్రశాంతి బత్తిన, యూనిసెఫ్, సిప్స్ బంద సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక అద్భుత బాలయేసు దేవాలయ ఎనిమిదవ వార్షికోత్సవ మహెూత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విచారణ గురువులు పసల తోమాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలకు ముఖ్యఅతిథిగా విజయవాడ మెత్రాసనం పీఠాధిపతులు తెలగతోటి జోసెఫ్ రాజారావు విచ్చేశారు. అనంతరం నిర్వహించిన సమిష్టి దివ్య బలి పూజ సమర్పించారు. బిషప్ తెలవతోటి రాజారావు భక్తులకు చేసి బైబిల్ సందేశం అందిస్తూ ప్రతి ఒక్కరూ దయ క్షమా కనికరంతో కూడిన జీవితం ఆలంభించాలని, తోటివారిని ప్రేమించే గుణాన్ని శత్రువుని ఆదరించే మనసుతో జీవించాలని ఉపదేశం ఇచ్చారు. ఈ పూజకు గన్నవరం విచారణలోని పలు గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ బాలాజీ, రెవరెండ్ ఫాదర్ విజయరాజు, ఫాదర్ పల్లె జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ఎన్. రమేష్

తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఘంటసాల ఆత్మ వారి సహకారంతో ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను వివరించారు. ఆయిల్ ఫామ్ కొబ్బరి తోటల పెంపకంలో అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. టమాట పసుప, మిరప, అరటి లో వచ్చు తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కెవికె కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి మంజువాణి పాల్గొని రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రానున్న ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా నాయకులకు, కార్యకర్తలకు పని చేయాలని వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము మండలంలోని పురిటిపాడు గ్రామస్తుల ఆహ్వానం మేరకు సామూహిక భవానీ దీక్షాదారుల ఇరుముడి కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు.ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అనంతరం గుడ్లవల్లేరు మండలంలోని పార్టీ స్థితిగతులను, నాయకులు, కార్యకర్తలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చిన తాను అండగా ఉంటానని రాము భరోసా ఇచ్చారు.

ఇరుముడిలో కార్యక్రమలో పాల్గొన్న వెనిగండ్ల

ప్రభుకాంత్ సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : పేద కుటుంబాలు ఆర్థిక స్వయంసంవృద్ధి సాధించేందుకు చేయూత నందించడంతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుకాంత్ సహకారమందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వంశీ అన్నారు. తిప్పనగుంట పీఏసీఎస్ అధ్య క్షుడు మూల్పూరు ప్రభుకాంత్ సొంత నిధులతో తయారు చేయించిన 4బడ్డీలను, విద్యార్థికి ఆర్థికసాయాన్ని గురువారం లబ్ధిదారులకు అయన అందజేశారు. సిరివాడకు చెందిన బిఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ చదువుతున్న కొవ్వలి స్మైలీ అనే ప్రతిభగల విద్యార్థినికి ఫీజు నిమిత్తం 30వేల రూపాయలు అందించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి కూడా కష్టపడి చదువుతున్న విద్యార్థిని కొవ్వలి స్మైలీని ఎమ్మెల్యే వంశీ అభినందించారు. గ్రామానికి చెందిన సాయిలు ముత్తయ్య, ఇంటూరి చిట్టి, ఏపూరి భీమయ్య లకు గురువారం మూల్పూరి ప్రభుకాంత్, వైసీపీ నాయకులతో కలిసి

బడ్డీకొట్లు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే వంశీ మోహన్ బడ్డీలు పంపిణీ చేశారు. యువత స్వశక్తితో ఎదగాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడిగా రైతులకు అధునాతన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం తో పాటు సామాజిక బాధ్యతగా పేదలకు సహకారమందిచడం అభినందనీమయని ప్రభుకాంత్ సేవలను సర్పంచ్ కలపాల భీమయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొవ్వా శివాజీ, కాజ పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: హనుమాన్‌జంక్షన్ లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి వారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అభయాంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభద్ర నక్షత్రం సందర్భంగా కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకుల ఆధ్వర్యంలో దాతలు, ఆలయ కమిటీ చైర్మన్ నెరుసు నాగభూషణం దంపతులు పసుపు కుంకుమలతో స్వామివారికి అభిషేకం పూజ నిర్వహించారు. ప్రత్యేకపూజకు, భక్తులకు వైజాగ్‌కు చెందిన విష్ణు వర్ధనరావు, వరాహలక్ష్మి దంపతులు పూజాసామాగ్రి వితరణ చేశారు.

పట్టుదలతో సాధన చేస్తే పతకాలు : ఎంపిపి

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణా జిల్లా అండర్ 19 పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఉంగుటూరు మండలం ఆత్కూర్ ఉన్నత పాఠశాల లో ఫెన్సింగ్ ఉమ్మడి కష్ణా బాల బాలికల జట్ల ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలాల నుండి 100 ఎంపికలకు హాజరైయ్యారు. కార్యదర్శి రవికాంత పర్యవేక్షణలో ధనియాల నాగరాజు ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన ఉంగుటూరు యం పిపి వి. సరోజిని మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి పసిడి పతకాలతో కష్ణా జట్లు తిరిగిరావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. లీలా రామన్ సౌజన్యంతో క్రీడాకారులు ఉచిత భోజన ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్, మాజీ ఉప మండలాధ్యక్షులు సింహాచలం, విద్యా కమిటీ చైర్మన్ షరీఫ్,పెద్ద ఆవుటపల్లి ప్రధాన ఉపాధ్యాయులు శేషు కుమారి వ్యాయామ ఉపాధ్యాయులు సుజాత, వెంకయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ఎంపికైన బాలుర జట్టు :ఇప్పిలో జి. బిళ్ల హరి, బి. నాగచరణ్, యం. సాజీర్ కుమార్, కె. రాహుల్, స్టాండ్ బై : వై. హర్ష ఉన్నారు. ఫోయిల్‌లో ఏ. రాకేష్, జి. చైతన్య, డి. వాసు నాయక్, బి. శ్రీ చరణ్, స్టాండ్ బై : పి. సురేష్ ఉన్నారు. శాబర్ లో యన్. వంశీ, కె. అక్షయ్, కె. మోహన్ రావు, ఏ. ఈశ్వర్, స్టాండ్ బై :

యన్. జీవన్ ఉన్నారు. **బాలికల జట్టు :** ఇప్పిలో టి.థెరిస్సా, సి.హెచ్ సిరి, కె.సుజాత, టి. రత్న కుమారి అలాగే స్టాండ్ బైలో యస్.కె కరిష్మా, అలాగే ఫోయిల్ లో ఏ. రోజా, పి.లోహిత, టి.ప్రవల్లిక, బి.కీర్తి, స్టాండ్ బై :బి. శిరీష అలాగే శాబర్ లో యస్. శ్రీ రమ్య, ఐ. లక్ష్మి, యం. శిరీష యస్. శ్రీ ప్రజ్ఞ, స్టాండ్ బై :యస్. కె సదా ఎంపియ్యాఆరు. కాగా కష్ణా జట్లకు కోచ్ మేనేజర్ గా డి. నాగరాజు (బాలుర ఉన్నతఉన్నత పాఠశాల పి. డి), యన్. హరి కుమార్ (శ్రీ విద్య విద్యాలయం పి. డి నందిగామ) వ్యవహరిస్తారని కార్యదర్శి రవి కాంత తెలిపారు. జట్లు నవంబర్ 1వ తేదీ నుండి 3వరకు నంద్యాల జరిగే రాష్ట స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొంటాయని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్పొరేటర్ సత్యబాబు
- పశ్చిమలో సిపిఎం 'ప్రజా రక్షణ భేరి' ప్రారంభం
- 15న చలో విజయవాడ విజయవంతం కోరుతూ సమావేశాలు

పశ్చిమలో ప్రారంభమైన ప్రజాభేరి రక్షణ యాత్ర

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్‌లో సిపిఎం 'ప్రజా రక్షణ భేరి' ప్రచార యాత్రను గురువారం 50వ డివిజన్ కార్పొరేటర్, సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు ప్రారంభించారు. ఆంజనేయ వాగు సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రచార యాత్రలో బిజెపి, వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలకు నిరసనగా కరపత్రాలు పంపిణీ చేస్తూ పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బిజెపి పాలనలో ఉన రాష్ట్రాలలో మైనార్టీలకు భద్రల లేకుండా పోతోందన్నారు. కోట్లాది మంది కార్మికుల పక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. తాను కూడా ఏమాత్రం తీసుపోనంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కార్పొరేట్‌లకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కృష్ణపట్నం, గంగవరం మేజర్ పోర్టులతో పాటు రాష్ట్ర ప్రజల సంపదను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. వైసిపి ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయని అన్నారు. మరో పక్క రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపారని, నిత్యావసర ధరలు పెరిగిపోయాయని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇ.వి.నారాయణ, కె.సూరిబాబు, ఎస్.సుబ్బారెడ్డి, గాదె బాలిరెడ్డి, కె.సత్యనారాయణ, సూరా శ్రీను తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష టిడిపి, ప్రశ్నిస్తానని చెబుతున్న జనసేన పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ విమర్శించారు. నవంబర్ 15న విజయవాడలో జరగనన్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పట్టణ కమిటీ అధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 14 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రజల వద్ద నుండి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కర్యదర్శి వర్గ సభ్యుల ఎం.నాగేంద్ర ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్వీ భద్రం పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ సుందరయ్య భవనంలో చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రజలను కలవరపరుస్తు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శి కట్టారపు గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం, గోపీనాయక్, కర్రీ వెంకటేశ్వరరావు, రవి శేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో కరపత్రం ఆవిష్కరణ

ఘాట్‌లో జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు

ఎటుచూసినా భవానీలే...

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై ఎటుచూసినా భవానీలే దర్శనమిస్తున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసి నేటితో మూడు రోజులైంది. ఈ నేపధ్యంలో దుర్గమ్మను దర్శించుకునేందుకు గురువారం కూడా భవానీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పద్మావతి ఘాట్, దుర్గాఘాట్, భవానీ, పున్నమి ఘాట్‌లు భవానీలతో కిటకిటలాడుతున్నాయి. కుమ్మరిపాలెం వైపు నుండి హెడ్ వాటర్స్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైను ద్వారా, అలాగే పద్మావతి ఘాట్ వైపు ఉన్న భవానీలు వినాయకుని గుడి వద్ద ఉన్న క్యూలైన్ల ద్వారా ఇంద్రకీలాద్రి చేరుకుని దుర్గమ్మను దర్శించుకుంటున్నారు. వీరి కోసం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. భవానీల తాకిడితో వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ నుంచి బ్రాహ్మణ వీధి, ప్రధాన రహదారి అంతా సందడిగా మారింది.

జీవనది ఫౌండేషన్ సేవ

ప్రజాశక్తి-వన్‌టౌన్: దసరా ఉత్సవాల సందర్భంగా యాత్రికులు స్నానమాచరించిన పద్మావతి ఘాట్‌లో పేరుకు పోయిన వ్యర్థాలను జీవనది ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు, జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపక

అధ్యక్షురాలు ఇంతేటి లక్ష్మీ దుర్గ తదితరులు గురువారం శుభ్రం చేశారు. దసరా నవరాత్రి సందర్భంగా విజయవాడ పద్మావతి ఘాట్ నందు నదిని శుభ్రం చేసి భవానీ దీక్షలు చేసిన వారి బట్టలు అన్ని క్లీన్ చేసి ఘాట్లు శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతు నదులు మనకు జీవనాధారమని, నదులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని భక్తులకు అవగాహన కల్పించారు. అనంతరం యాత్రికులు ప్లాస్టిక్ నివారణ గురించి అవగాహన కల్పించిన తరువాత యాత్రికులకు, పోలీస్ వారికి, మున్సిపల్ సిబ్బందికి జ్యూట్ బ్యాగులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వలవల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ మార్పిడి ముసుగులో కుట్ర : గద్దె

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని ఎన్‌టిఆర్ కాలనీలోని కామన్ సైట్‌పై వైసిపి నాయకుల కన్ను పడిందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. బదలాయింపు పేరుతో కౌన్సిల్ అజెండాలో వైసిపి పెట్టిన 4వ డివిజన్ ఎన్‌టిఆర్ కాలనీలోని కామన్ సైట్ వద్దకు గురువారం ఆయన వెళ్లి పరిశీలిలంచారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ భూ మార్పిడి ముసుగులో రూ.8 కోట్ల విలువైన భూమిని ఒక ప్రయివేట్ పాఠశాలకు బదలాయించి తద్వారా కోట్ల రూపాయల బేరాలు నడుపుతున్నారని, దీని వెనుక వైసిపి పెద్దల హస్తం ఉందని అన్నారు. నగరానికి నడిబొడ్డున రూ.8 కోట్ల ఖరీదైన భూమిని ఇచ్చి నగర శివారులో రెండు కోట్ల విలువ చేసే భూమిని విఎంసి వారు తీసుకోవడం వెనుక పెద్ద కుట్ర జరుగుతుందన్నారు. వైసిపి పాలనలో ప్రభుత్వ భూములకు రక్షణ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కాలనీ పెద్దలు దాసరి హరికృష్ణ, గోలు రవీంద్ర, మలినేని చంద్రశేఖర్ పలువురు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న గద్దె

దసరా డిలైట్స్ ఆఫర్లు కొనసాగింపు

విజయవాడఅర్బన్: పండుగల సందర్భంగా అమెజాన్ నిర్వహించిన దసరా డిలైట్స్ ఆఫర్లు ఇంకా కొనసాగుతున్నాయని అమెజాన్ రీజనల్ ఇన్‌ఛార్జి కిషోర్ తోట ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసరాలు, ఇండియన్ స్వీట్లు, స్నాక్స్, డ్రైఫ్రూట్స్, హోమ్‌డెకార్స్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ ఫోన్లు, యాక్సెసరీస్, పెద్ద ఉపకరణాలు, ఫ్యాషన్ బ్యూటీ ఎసెన్షియల్స్, ఇలా ఎన్నో రకాల ఉత్పత్తులను డిలైట్ ఆఫర్లుగా అందిస్తున్నామని తెలిపారు. హస్తకళా వస్తువులు, ఇతర అన్ని రకాల ఐటెమ్స్‌పై కూడా ఆఫర్లు వర్తిస్తాయని తెలిపారు. వివరాలకు దగ్గరలోని అమెజాన్ స్టోర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

'క్వాంటమ్ చుక్కలపై పరిశోధనలు జరగాలి '

ప్రజాశక్తి-వన్‌టౌన్: రసాయన శాస్త్రంలోని క్వాంటమ్ డాట్స్‌పై మరింత లోతైన పరిశోధనలకు విద్యార్థులు ఆసక్తి చూపాలని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నోబుల్ బహుమతి పొందిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణ, అభివద్ధికి సంబంధించిన అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి మాట్లాడుతూ నానో టెక్నాలజీ తరువాత క్వాంటమ్ డాట్స్‌కు సంబంధించిన ఆవిష్కరణ ఇటీవల ముందుకు వచ్చిందన్నారు. దీనివలన రానున్న కాలంలో ఎలక్ట్రానిక్స్, మినీ సెన్సార్‌లు, క్వాంటమ్ కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణకు దోహదపడుతుందన్నారు. క్వాంటమ్ డాట్స్ చాలా ప్రత్యేకమైన లక్షణాలను కలిగి ఉండటమే కాకుండా వివిధ రంగాల అభ్యున్నతికి అండగా ఉండే అవకాశముందన్నారు. ఈ రంగంలో చాలా విస్తతమైన పరిశోధనలకు అవకాశముందన్నారు. అదే విశ్వవిద్యాలయానికి చెందిన మరో ఆచార్యులు డాక్టర్ ఈ సతీష్ మాట్లాడుతూ క్వాంటమ్ డాట్స్ వలన వ్యాక్సిన్ల సంశ్లేషణకు సంబంధించి వైద్యరంగంలో చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి'

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని దానికి అనుగుణంగా కృషి చేయాలని ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. నగరంలోని ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం స్టూడెంట్ ఎక్సేంజ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ డిగ్రీ చదువు పూర్తవగానే విద్యార్థులు ఎక్కువ మంది విదేశీలలో ఉన్నత విద్యను అభ్యసించడాఇకి ఆసక్తి చూపుతున్నారన్నారు. అయితే కొత్త ప్రదేశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గురించి విద్యార్థులు ముందుగానే తెలుసుకోవాలని, ఇటువంటి సదస్సులు నిర్వహించడం వలన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను అందించాలనే ఉద్దేశంతో స్టడీ ఎక్చేంజ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈసదస్సులో విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల సిఎస్‌సి విభాగాధిపతి సి.హెచ్.రాజేంద్ర, ఐటి విభాగాధిపతి డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ రామకృష్ణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.